కథానిక

# పొగమంచు

ఆర్. యం. చిదంబరం

గడియారం నాలుగు కొట్టింది. మంచంమీద పడుకున్న సరోజను ఒంటరితనం నిశిరాత్రిలా కబళించింది. కిటికీలోంచి సన్నగా పడుతున్న సూర్యకిరణాలకు గోడమూలనున్న సాలిగూడు మెరిసింది. అది గమనించిన సరోజ నవ్వుకుంది. మధ్యాహ్నానికి ఆ సాలెగూడు లేదు. ఆ అల్ప ప్రాణి ఇంతలో గూడు కట్టేసింది. జీవితంమీద దానికెంత ఆశ! ఎంత ఓర్పు! ఎన్ని ఆటంకాలు కలిగినా తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూంటుంది కద! ఆ ఓర్పులో వెయ్యోవంతైనా తనకుంటే ఎంత బాగుండును?

ఇంత చిన్న వయసులోనే తనకు జీవితంమీద విసుగు, వైరాగ్యం బయలుదేరింది. మంచమెక్కిన తరువాత ఈ జీవితానికి అర్థమేమిటని చాలా సార్లు ప్రశ్నించుకుంది. సమాధానం రాలేదు. దూరం ఆలోచిస్తే జీవితంలో మిగిలేదేమిటి? ఏ లక్ష్యంకోసం ఈ సంఘర్షణ? ఎందుకోసం ఈ నిరంతర ప్రవాహాని కెదురీత? సూర్యుడు మామూలుగా ఉదయిస్తున్నాడు. సంధ్యారాగం తలెత్తగానే పశ్చిమాన్ని ముసుగేసుకుంటున్నాడు. తారలు మెరుస్తున్నాయి. జీవులు జీవిత క్రమం సాగించి ధూళిలో కలిసిపోతున్నారు. బోధపడని ఏ మహా సూత్రానికి ప్రకృతి తలవంచి దాస్యం చేస్తోంది?...ఇదేనా జీవితాని కర్థం? కాని తన బతుకులో మిగిలిందేమిటి?

ఈ కాల్చుకుతినే రోగం.

"గడచినకాలం వస్తే బాగుండును!" అనుకుంది సరోజ. కాని మరుక్షణంలో తన తెలివితక్కువకు పెదవుల మధ్యనుంచి అర్థ చంద్ర గ్రహణంనాటి వెన్నెలలాంటి నవ్వును వదిలింది. గడచిన రోజులు రావని తనకు తెలుసు. అయినా ఆ వాతావరణాన్ని సృష్టించుకుని ఆనందించటంలో ఏముందో! గడచిన జీవితపు గులాబీ రేఖలు మసగ్గా కనిపించాయి...

అవి పాలవెన్నెల్లాంటి రోజులు. ఓనాటి సంఘటన...తను పకోడీలు చేస్తోంది. వెన్నెల్లో డాబామీద కూర్చుని భోంచేస్తే అందులో ఆనందం ఏమిటో!...ఆవేళ ఆదివారంకనుక భర్త కుర్చీలో కూర్చుని డైజెస్టు చదువుకుంటున్నాడు. తనవైపు క్రీగంటిచూపులో వెయ్యోవంతైనా విసురుతున్నట్టు కనిపించదు. ఆ కథల్లో కన్పించిన అనూహ్య సౌందర్యమేమిటో?...కాస్త తనకు సాయం చేయకూడదూ? తను ఉక్కిరిబిక్కిరవుతోంది. ఇంకా మూడు ఐటమ్‌లున్నాయి... పుస్తకంలో మొహం దాచేసుకున్నాడు. కొత్త కాపరమైనందుకు బంధాల్లేని స్వేచ్ఛా జీవుల్లా కళ్ళల్లో ప్రణయ ప్రవాహాలు కురిపిస్తూ విహరిస్తున్నారు.

"సరోజా!...పిల్లి!" హఠాత్తుగా అరిచాడు శ్రీపతి. సరోజ త్రుళ్ళిపడి పిల్లిని అదరగొట్టి తరమటానికి చేయెత్తి అటు తిరిగింది. అక్కడ ఏ జంతువూ కనిపించలేదు. తిరిగి చూసేసరికి పకోడీలకు కలుపుతున్న పిండిలో ఉల్లిపాయ ముక్కలు కనిపించాయి.

సరోజ కళ్ళల్లో చిలిపి కోపం చిందులాడింది. చాలాకాలంనుంచి వాళ్ళయింట్లో ఎవరూ ఉల్లిపాయలు తినలేదు. సరోజకు కూడా అవంటే అసహ్యం. నిష్ఠూరవ్వల్లా నాలుగుమాటలనేద్దామనుకుంది కాని శ్రీపతి కంటినవ్వుకు తన నవ్వును జతచేసి వూరుకుంది...సరోజ కనుగొలకుల్లో హఠాత్తుగా జనించిన కన్నీటిచుక్క సూర్యరశ్మికి మెరిసింది. కల కరిగిపోయింది. అలాంటి మధురానుభవాలెన్నో!

బాబు పుట్టినప్పటినుంచి ఈ రోగంలో చిక్కుకుంది. పిల్లాడుపుట్టిన మూడోనెలకే భర్త దగ్గరకు పోదామనుకుంది. శ్రీపతికూడా పదేపదే ఆ విషయం వుత్తరాల్లో ప్రసంగిస్తూవచ్చాడు. కాని కారుమబ్బులా యీ వ్యాధి కమ్ముకుంది.

రోగం డాక్టర్ల కంతు చిక్కలేదు. గుండె దడ ప్రారంభమైంది. ఆయాస మెక్కువగా వుండేది. కొంతకాలం నిర్లక్ష్యంగా దొర్లిపోయింది...కాని పోనుపోను నాలుగడుగులు వేయగానే వడగళ్ళ వాన వచ్చినట్లు ఆయాసంవచ్చి పడేది. నిలుచున్న పాళంగా కూలబడిపోయేది. అధికారులతో సెలవుకోసం పోట్లాడుతున్న శ్రీపతి బాబుకు రెండు నెలలు గడిచాక కాని రాలేకపోయాడు. సరోజను చూడగానే వయాగరాను దాటుతున్న వాడిలా హడలిపోయాడు. సరోజను తనతో తీసుకుపోయి హాస్పిటల్‌లో జాయిన్ చేయిస్తానన్నాడు.

"ఇక్కడే ఉండనీ శ్రీపతీ! త్వరలోనే నయమవుతుందని డాక్టరన్నాడు. నువ్వు ఉద్యోగం చేస్తున్నవాడివి. ఎల్లకాలం ఇంట్లోవుండి అమ్మాయిని కనిపెట్టుకుండగలవా?...హాస్పిటల్ మాత్రం వద్దు...నీ కెవరుతోడు?" అని మామగారడుగుతుంటే శ్రీపతి మొదట్లో ఒప్పుకోకపోయినా చివరికది నిజమేనని నిర్ణయించుకుని తరుచు ఉత్తరాలు రాస్తూండమని వెళ్ళిపోయాడు. వారిద్దరి మధ్యనున్న బాహ్యప్రేమ మలేరియా జ్వరంతో బాధ పడసాగింది. ఇప్పటికి బాబు భూమిమీద పడి ఆరునెల్లైంది. కాని వ్యాధి ఇంకా వికటంగా నవ్వుతోంది కాని చల్లగా జారుగాలేదు.

"కిటికీ తలుపులు వేసుకోలేకపోయావా సరోజా?...ఎంత తగుల్తోంది" అని సరోజ తల్లి తలుపువేసింది. చురుక్కున ఎండతగిలి చెంప కాల్తున్నా కిటికీ తలుపులు వేయాలన్న ఆలోచన ఆమెకు లేనేలేదు!

పక్కకు ఒత్తిగలిపడుకుంది. శరీరంలో మిగిలిన ఎముకలు మంచానికి గుచ్చుకుని బాధ పెట్టాయ్. ఠీవిగా బెంచీమీద నిల్చున్న మందు సీసా-ఔన్సుగ్లాసు-గ్లూకోజ్ డబ్బా-నారింజరసం పిండుకునే గాజు సామగ్రి ఆమె నోదార్చాయి. ఆమెకేమీ భయంలేదని ప్రపంచంలో వున్న మందులన్నీ తాము దిగుమతి చేయగలమని హామీ యిచ్చాయి.

అంతసేపూ నిశ్శబ్దంగా రైలుబండితో ఆడుకుంటున్న బాబు సన్నగా ఏడుపు లంకించుకుని [illegible]

సౌందర్యాన్ని చూస్తూ పడుకుంది కాని దగ్గరగా వెళ్ళి ఓదార్చలేదు. తను బాబుకు దూరంగా వుండాలన్న డాక్టరు శాసనం ఆమెలో నిరంతరం ఘోషపెడుతూనేవుంది. ఏడుపు విన్న తల్లే పాలబుడ్డి తీసుకొచ్చి బాబుకు పాలు పట్టింది. సరోజకు కళ్ళంట నీళ్ళు తిరగటం పరిపాటయిపోయింది. తల్లికి తన కన్నీరు కనిపించకుండా అటు తిరిగి పడుకుంది. ఏవో రబ్బరు బొమ్మలు వాడిముందు పడేసి తల్లి వెళ్ళిపోయింది.

గడియారం అరగంట కొట్టింది.

"అమ్మగారూ! అల్లుంటికి డాక్టరమ్మొచ్చిందండి. ఒళ్లంతా నీరటించిందిగా! ఆసుపత్రికి తీసుకెళ్ళమంటే యిన్నారు కారు. ఏమౌతుందో ఏమో!" అన్న పనిమనిషి మాటలు సరోజచెవిని పడ్డయ్.

"ఆం వాళ్ళు వింటారే? డబ్బులేని వాళ్ళే అనుకో. గవర్నమెంటువాళ్లు ఆసుపత్రులు ఎందుకు కట్టించారు చెప్పు? బీదవాళ్ళకోసమేగా! నాకు మొన్నట్నుంచీ భయంగానేవుంది వాళ్ళమ్మతో చెప్పాను కూడా. హాస్పిటలుకు తీసుకెళ్ళమ్మా! పురుడు సులువుగా అవుతుంది అని. కాని నా మాటలు గాల్లోకొదిలేశారు! అని తల్లి సమాధానం చెప్పింది. బాధా హృదయంతో విందామాటలు.

బూట్లుచప్పుడుచేసుకుంటూ డాక్టరు వచ్చాడు. దేవుడికివ్వాల్సిన స్వాగతం ఇవ్వబడింది. సరోజను యథారీతిగా పరీక్షించాడు. డాక్టరు ముఖ కవళికలు విచిత్రంగా మారుతుండే తలిదండ్రుల ముఖాలమీద వాటి ప్రతిబింబాలు కనిపించాయి.

"గుండె బాగా నీరసించిపోతోంది కామయ్యగారూ! రోగమేమీకనిపించదు. మనోవేదనెక్కువగా వుంది. అమ్మాయ్! అస్తమానం ఏవో ఆలోచిస్తుంటావనుకుంటా. నువ్వు దిగులు పడితే ఈ రోగం తగ్గేదిలేదు. మనస్సుకు శ్రమ కలిగించకూడదు" అన్నాడు డాక్టరు.

"అమ్మాయిని తీసుకురమ్మని, అక్కడ హాస్పిటల్‌లో జాయిన్ చెయ్యించి స్పెషల్ ట్రీట్‌మంట్ చేస్తానంటున్నాడు అల్లుడు. మీ అభిప్రాయం ఏమిటి?" అనడిగారు కామయ్యగారు.

"నోనో...మళ్ళీ ఔన్‌లైఫ్ లాభంలేదు... [illegible]

కాదు...పటుత్వంలేని శరీరం. అయినా నాలుగు రోజులాగండి చూద్దాం" అని డాక్టర్ వెళ్ళిపోయాడు. కామయ్యగారు ఆయన్ననుసరించాడు.

"అయినా ఏ ముహూర్తాన తల్లికడుపున పడ్డాడో కాని ప్రాణాలమీదికే తెచ్చాడు. వీడు పుట్టకపోయినా బాగుండును... నాకూతురు నిక్షేపంలా వుండేది" అని ఏడుపు దిగమింగింది తల్లి.

సరోజ పెదిములు కోపంతో వణికిపోయాయ్. సంధ్యారాగమంతా కళ్ళల్లో కనిపించింది. "అమ్మా!...ఇంకెప్పుడూ అలాంటిమాటలు నా ముందనకు. మధ్య వాడేంచేస్తాడు? ఏనాడో నే చేసుకున్న కర్మ. నేను లేకపోతే ఇలాగే వాణ్ణి తల్లిని చంపిన వాడంటారు...వాడిమనసు విరుస్తారు. పాప, వాడేం చేస్తాడు?"

ఆయాసం, కోపం అడ్డగించటంవలన అంతకంటె ఏమీ అనలేకపోయింది. తల్లి మారుమాట్లాడకుండా వెళ్ళిపోయింది.

సూర్యుడు విషాదంగా అస్తమించాడు. సంధ్యారాగం ప్రపంచంలోవుండే దుఃఖాన్నంతా సౌందర్యంగా ప్రదర్శించింది.

గడియారం ఆరుకొట్టింది.

ఏడుపులు ఆకాశాన్నంటుతున్నాయ్. ఆ ధ్వనికి దిశా కాంతల గుండెలుచెక్కలౌతున్నాయ్. అనంతమైన చీకటినంతా పోగుబెట్టి ఆ వాతావరణం భయంకరంగా ఉంది.

"పాపం!...ఆ అమ్మాయి పోయింది. పురుడు సవ్యంగా వెళ్ళలేదట. వాతంకమ్మి చచ్చిపోయింది. నే మొత్తుకుంటున్నా, ఆస్పత్రికితీసుకెళ్ళమని. అది వినిపించుకుంటేగా!...ఏ ఆపరేషనో చేసి బతికించేవాళ్ళు... అయినా తల్లిని చంపి పుట్టినవాడు" అంటోంది సానుభూతిగా తల్లి.

"అంతే! తల్లిని చంపటానికే పుట్టాడువాడు" అని తండ్రికూడా విచారించాడు.

ఈ మాటలు వింటున్న సరోజకు దావాగ్ని చుట్టేసినట్లుంది. వాతావరణమంతా భయానకంగా కనిపించింది. గబగబా లేచివెళ్ళి ఉయ్యాలలో పడుకున్న బాబును ఎండిపోయిన హృదయానికి దగ్గరగా-ఇంకా దగ్గరగా అదుముకుంది. ముద్దులవర్షం కురిపించింది. ఆమె కన్నీరు

చరచరా వచ్చి చిట్టెలుక తన బిలంలోకి పోయినట్టు మంచంమీద వాలిపోయింది. దిండులో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. అంత చరచరా లేచి వెళ్ళటానికి తనకు శక్తి ఎలా వచ్చింది? అసలు బాబుదగ్గరకు తను వెళ్ళవచ్చా? ... ఎంత అపరాధం జరిగింది! తుపానునాటి సముద్రతరంగాల్లా వుప్పొంగుతున్న తన ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయింది... పొరుగింటివాళ్ళ నిర్లక్ష్యానికి బలైంది. తను కూడానా?...ఛ...ఏమిటీ ఆలోచనలు? తనకేం? నిక్షేపంలా వుంది. డాక్టరన్నట్టు దీనికంతా మనోవేదనే కారణం.

భావాన్ని వెంటాడలేక నిట్టూర్పు నాపుకోటానికి యత్నించింది.

* * *

శ్రీపతి ఆఫీసునుంచి రాగానే పనిమనిషి ఉత్తరము అందించింది. ఉత్తరాన్ని విసుగ్గా టేబిలుమీద గిరవాటేశాడు. ఎడ్రసు చూశాడు. తండ్రి దగ్గర్నించి వచ్చింది. ఆవేళఆఫీసులోపని సరిగా జరగలేదు. సరోజను తనవద్దే వుంచుకుని చికిత్స చేయించాలనుకున్నాడు. కానది సాధ్యంకాదు. తను ఆఫీసులో వున్నప్పుడు ఏదైనా జరిగితే? జీవితాంతం వరకు రాచపుండులా బాధిస్తుంది. ఆ మహానగరంలో ప్రతి ఆవయవానికి స్పెషలిస్టులున్నారు. పెద్దపెద్ద బోర్డులు కట్టుకున్నారు. డబ్బుకుమ్మరించటానికి తనూ సిద్ధం! కాని...

కవరు చించి చదువుకున్నాడు.

"సరోజకు వాళ్ళేం సరిగ్గా చూడటంలేదట. ఎవరో అణాకానీ డాక్టరు చూస్తున్నాడట. రోజు రోజుకీఎక్కువవుతోందట. నువ్వుండీనీ పెళ్ళాన్ని బాగుచెయ్యించుకోలేకపోతున్నావు. మొన్న మీ అన్నయ్య పనుండి ఆ వూరెళ్ళి అంతా కనుక్కొచ్చాడు...వెంటనే సరోజను పంపించమని వుత్తరంరాయి. సాయానికి నేనొస్తా. మనక్కావలసింది; పాపం, ఆ పిల్ల బాగుపడటం. అదేదో పెద్ద జబ్బులాగే వుంది..."

ఇది తల్లిసమస్యకు చూపిన పరిష్కారసూత్రం.

శ్రీపతి వెంటనే వుత్తరంరాసి పడేశాడు. రిజిష్టరుకూడా చేయించాడు. సరోజను కనుక

చేసుకుంటాడని- ఏర్పాట్లు జరుగుతున్నాయని రాశాడు. నిజానికి మరో యువతికి సరోజస్థానం దక్కాలని కాదు... కేవలం తలిదండ్రులని వంచ డానికే... అలా రాసినందుకు తరువాత చాలా సార్లు బాధపడ్డాడు.

సరోజకోసం నాలుగురోజులెదురు చూశాడు. అయిదోరోజు రాత్రి టెలిగ్రాఫ్ ప్యూన్ నిద్ర పోతున్న శ్రీపతిని లేపి టెలిగ్రాం అందించి పోయాడు. గుండెలు చెవిదగ్గరగాచేసి కొట్టుకు న్నాయి.

కుర్చీలో కూలబడిపోయాడు, టెలిగ్రాం విప్ప లేకపోయాడు.

సరోజ చనిపోయిందేమో! ..కాకపోతే ఎందుకు టెలిగ్రామిస్తారు? ఆమె మరణానికి తనే కారకుడవుతాడు.

"మళ్ళీ పెళ్ళిచేసుకో...ఏంపోయింది? ఉత్త రంలో రాశావుగా?" అని ఎవరో వికటంగా నవ్వుతూ అన్నట్టనిపించింది. టెలిగ్రాం విప్పి చదవటానికి మనసు కేంద్రీకృత మవటంలేదు. తన నిర్లక్ష్యం మూలంగానే సరోజ మాయమైంది. చివరికి వణుకుతూ టెలిగ్రాం చదువుకున్నాడు:

"సరోజా నేనూ పొద్దున్న మెయిలుకు వస్తు న్నాం-స్టేషనుకు రావలసింది-కామయ్య."

శ్రీపతి తృప్తిగా నిట్టూర్చాడు.

---

యుగయుగాల మన సంస్కృతిలో-

# దీపోత్సవం

శశిభూషణ్ పాత్రో

మన దేశంయొక్క అత్యంత ప్రాచీనమైన మహాపర్వము—దీపావళి. కొన్ని చారిత్రక ప్రమాణాలతో ఈ మహోత్సవం మన భారతావనిలో ప్రతీయేటా అవతరిస్తుంది. ఆ యినప్పటికీ వివిధప్రాంతాలలో ఏవిధంగా ఏ ఉద్దేశంతో దీపావళిపండుగ చేసుకుంటారో వాటినికూడా చర్చిద్దాం. ఆంధ్రరాష్ట్ర అవతరణానంతరం ఇదే మొట్టమొదటి దీపావళి. ఈ శుభసమయాన దీపావళి విషయమై చర్చించే ముందు "దీపం" విషయమై ముందు చర్చిద్దాం.

"దీపం" అనగానే హృదయంలో అదో విధమైన ఆనందకరమైన భావం కలుగుతుంది. దీపం మనయెదుట వున్నా లేకపోయినా, కల్పనా మాత్రంతోనే హృదయం హర్షోల్లాసంచేత పులకరిస్తుంది. అల్లాడీన్ తాలూకు ఆశ్చర్యకరమైన దీపిక సంగతి అందరికీ తెలిసిందే. దాని మహిమ అలావుండగా ఒక మామూలు మట్టిప్రమిదెలో ఎంత మహత్తుందో అది సర్వవిదితము. ప్రపంచంలోనున్న అంధకారమంతా కలిసికూడా దీపంయొక్క వెలుగుని నశింప చెయ్యలేదు.

సమయానికి మట్టిప్రమిదయొక్క ఆ మాత్రం [illegible] కంగా నేవుంటుంది. దీపంలేకపోతే ప్రపంచమంతా అంధకారమయం. దీపమే ఇంటికి అలంకారం. అందుకే సంస్కృతంలో దీన్ని "గృహమణి" అన్నారు. అయితే దీపం వెలిగించటానికి కారణాలుకూడా వున్నాయి. సాయంత్రం కాగానే ఇళ్ళల్లో దీపాలు వెలిగిస్తాం. కేవలం అంధకారాన్ని పారద్రోలాలనే ఉద్దేశంతోనేకాకుండా సౌభాగ్యంకోసంకూడా వెలిగిస్తాం. అదే కారణం చేత దీపం వెలిగించి దేవుని నమస్కరించి ఈ శ్లోకాన్ని చదువుతాం.

"దీపంజ్యోతిపరబ్రహ్మం దీపేన సాధ్యతేసర్వం
దీపం సర్వతమోపహం వందే సంధ్యా
దీపం నమోస్తుతే"

ఇంట్లో దీపం వెలిగించకపోతే అపశకునంగా భావిస్తాం. హిందువులలో దేవతల నారాధించే సందర్భంలో దీపదానంచేసే రివాజుంది. దేవాలయాల్లోనే గాకుండా, సమాధుల దగ్గరకూడా దీపం వెలిగిస్తారు కొంతమంది (ఈ రివాజు కొన్ని హైందవేతర జాతుల్లోకూడా వుంది). కార్తీకమాసమంతా దీప పూజతోనే గడుస్తుంది.

అనాదినుండీ మనం శుభసమయాల్లో దీపాన్ని [illegible]